క్లుప్తంగా

డ్రెయిన్ల నిర్మాణ పనుల పరిశీలన



గొర్రిపూడిలో సీసీ డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కరప: గొర్రిపూడిలో రహదారికి ఇరువైపులా జరుగుతున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు స్థానిక నాయకులతో కలసి పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేయాలన్నారు. గొర్రిపూడి నుంచి జి.వేమవరం వెళ్లేరోడ్డు ధ్వంసం కావడంతో రహదారిని నిర్మించి, గ్రామంలో సీసీ రోడ్డు, రెండు పక్కలా సీసీ డ్రెన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేశారన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, పుణ్యమంతుల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిశోర్

కాకినాడ సిటీ: ఓటర్ల జాబితా ముసాయిదా రూపకల్పన నేపథ్యంలో ఇప్పటి వరకు నమోదైన ఓటర్ల వివరాలు పొందుపరచడంతో పాటు నూతన ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో ఈట్ల కిశోర్ వివరించారు. ఆయన గురువారం రూరల్ నియోజకవర్గ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 28, 29 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్ అప్పారావు, టి.రమణమూర్తి, టి.నాగేశ్వరరావు, పి.చర్యన్, రూరల్ తహసీల్దార్ మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన ఇంజరపు చందుకుమార్ (20) ఈ నెల 25వ తేదీ రాత్రి మండలంలోని గజ్జనపూడిలో టెంట్‌హౌస్ సామగ్రి వాహనంపై తరలిస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఏఎస్సై ఆదినారాయణ తెలిపారు.

అయ్యప్ప దీక్ష చేపట్టిన ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. తాళ్లరేవు బైపాస్ రహదారిలోని అయ్యప్పస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, దీక్షను చేపట్టారు. ఎమ్మెల్యే పొన్నాడ 40 రోజుల పాటు ఈ దీక్షలో ఉండి, స్వామివారి దర్శనానికి శబరిమలై వెళతారు. దీక్ష తీసుకున్న వారిలో ఎమ్మెల్యే పొన్నాడతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, దొరబాబు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వర్లు, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్ తదితరులు ఉన్నారు.

● ఆత్మీయ స్వాగతం









రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్ దివాన్‌చెరువులోని డీబీవీ రాజు లే అవుట్‌లో గురువారం జరిగింది. వధూవరులు గణేష్, సుకీర్తిలను ఆశీర్వదించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి నేరుగా దివాన్‌చెరువుకు హెలికాప్టర్‌లో వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కలసి ఆత్మీయంగా స్వాగతం పలికారు.

సంక్షేమం.. అభివృద్ధి లక్ష్యంగా..

- గ్రామాల్లో 'గడప గడపకూ' నిధులు
- అభివృద్ధి పథంలో పల్లెలు
- డ్రెనేజీలతో మురుగుకు స్వస్తి
- జోరుగా రహదారులు, కల్వర్టుల నిర్మాణం
- నియోజకవర్గంలో రూ.20 కోట్లతో పనులు



సర్పవరంలో నిర్మించిన విశాలమైన సీసీ రోడ్డు



వలసపాకల గంగరాజునగర్ రోడ్డు నంబరు 4లో డ్రెనేజీ నిర్మాణం

కాకినాడ రూరల్: ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు తెలియజేయడమే కాదు.. వారు అడిగే మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయంగా నిర్వహిస్తున్న 'గడప గడపకూ మన ప్రభుత్వం' పల్లె రాతను మారుస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలకు నిధుల వరద తీసుకువస్తోంది. నవరత్న సంక్షేమ పథకాలతో ఖుషీగా ఉన్న ప్రజలు ఇప్పుడు అభివృద్ధి పరుగులతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న మళ్లీ రావాలని కోరుకుంటున్నారు. నియోజవర్గంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. రూరల్‌లో 41 సచివాలయాలు, కరప మండలంలో 21 సచివాలయాలతో పాటు అర్బన్‌లో 17 సచివాయాలు కలిపి 79 సచివాలయాలు వరకు ఉన్నాయి. రూరల్, కరప మండలాల్లో నాలుగు సచివాలయాలు, అర్బన్‌లో 7 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. సచివాలయాల వారీగా గడప గడపకూ పూర్తయిన చోట మౌలిక వసతుల కల్పనకు మొదటి, రెండో విడతల్లో రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీటితో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మిస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.10.03 కోట్లతో 305 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో రూ.3.53 కోట్లతో 130 పనులు చేపడుతున్నారు. కరప మండలంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రూ.4 కోట్లతో 91 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో రూ.2.60 కోట్లతో 66 పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి. సముద్ర మట్టానికి లోతట్టుగా కనిపించే కాకినాడలో అధిక వర్షాల సమయంలో వరద నీరు ఇళ్లు, వీధుల మధ్య నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడేవారు. డ్రైనేజీల నిర్మాణంలో ఆ పరిస్థితి తప్పనుంది. సర్పవరంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాకలపూడిలో మేజర్ డ్రైనేజీని నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి గ్రామాలకు మురుగు సమస్య పరిష్కారం అవుతుంది. ఆయా గ్రామాల ప్రజల విన్నపాల మేరకు ఎమ్మెల్యే కన్నబాబు మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటితో పాటు కాకినాడ అర్బన్‌లోని రూరల్ డివిజన్లలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

డ్రైనేజీల సమస్యకు పరిష్కారం



సర్పవరంలో డ్రైనేజీకు మోక్షం లభించింది. గత ప్రభుత్వాలు డ్రైనేజీలు నిర్మించకుండా వదిలేయడంతో మురుగునీరు సీసీ రోడ్లపై ఉండేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక, ప్రజలు గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబుకు విన్నవించుకోవడంతో ఇప్పుడు పనులు జోరుగా జరుగుతున్నాయి. మా గ్రామంలో 4 సచివాలయాలకు రూ.1.6కోట్ల నిధులు రానున్నాయి.

– శీలం నాగేశ్వరరావు, సర్పంచ్, సర్పవరం

మౌలిక వసతులకు పెద్దపీట



ప్రజల అవసరాలు తెలుసుకుని నడిపించే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. నియోజవర్గంలో గడప గడపకూ కార్యక్రమాన్ని యజ్ఞంలా చేపడుతున్నాం. లబ్ధిదారులు అందుకున్న సంక్షేమ పథకాలు వివరించడమే కాదు, వారు అడిగే మౌలిక సదుపాయల కల్పన మా బాధ్యత. అందుకే ప్రభుత్వం అందిస్తున్న ఈ నిధులతో తక్షణమే డ్రైనేజీలు, రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు పెద్ద పీట వేస్తున్నాం. గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయి. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం మురుగు సమస్యకు డ్రైనేజీలతో పరిష్కారం చూపుతున్నాం. సంక్షేమమే, కాదు అభివృద్ధి కూడా మా నినాదం.

– కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



రోగికి మందుల కిట్‌ను అందజేస్తున్న దృశ్యం

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అమలుచేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. మండలం గొర్రిపూడి సచివాలయం-2లో గురువారం సర్పంచ్ కానూరు రమాదేవి అధ్యక్షతన శిబిరం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నియోజకవర్గ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని జెడ్పీటీసీ కోరారు. శిబిరానికి 330 మంది వచ్చి, తమ పేర్లు నమోదు చేసుకోగా, మండల వైద్యాధికారి ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ పి.ఆశ తదితరలు పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పోషకాహార స్టాల్స్ ఏర్పాటుచేశారు. స్థానిక నాయకులతో కలసి రోగులకు జెడ్పీటీసీ మందుల కిట్లను, కళ్లజోళ్లను అందజేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, ఎంపీడీఓ కె.అప్పారావు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పటిష్టంగా సివిల్ రైట్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్

- ఆర్డీవో ఈట్ల కిశోర్
- డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం

కాకినాడ సిటీ: కాకినాడ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయడంతో పాటు డివిజన్ స్థాయిలో సివిల్ రైట్స్ డే సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఆర్డీఓ ఈట్ల కిశోర్ అన్నారు. గురువారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా డీవీఎంసీ సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన బాధితులకు సత్వర న్యాయం అందిస్తామని అన్నారు. డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ ప్రజల్లో దాగి ఉన్న సాంఘిక అసమానతలపై అవగాహన కల్పించే నిమిత్తం సివిల్ రైట్స్‌డే ను సక్రమంగా నిర్వహించేందుకు ఎమ్మార్వోలు చర్యలు చేపట్టాలని ఆర్డీవో ఆదేశించారు. కాకినాడ డీఎస్పీ కె.మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, బండి వీరలింగేశ్వరరావు, పిల్లి జ్యోతి, గంగవంసం త్రినాథ్‌దేవ్‌లు, డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సిద్ధాంతపు రాజు, బోనగిరి బాలభద్రరావు, కాటూరి కొండబాబు, మానగిరి రాంబాబు, కాకినాడ, తుని, పెద్దాపురం సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, కాకినాడ డివిజన్ పరిధిలో ఉన్న వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు. తొలుత కాకినాడ డివిజన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు, వాటి పురోగతి, బాధితులకు సహాయం పంపిణీ, ఉపాధి కల్పన, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, గత సమావేశంలో తీర్మానించిన అంశాలపై చేపట్టిన చర్యలు తదితర అంశాలపై సభ్యులు, అధికారులు సమీక్షించారు.

శ్రీరంగనాయకపురంలో అయోధ్య రాముని పాదుకలు



అయోధ్య శ్రీరాముని పాదుకలు

తాళ్లరేవు: అయోధ్య రాముని పాదుకలు మండలం శ్రీరంగనాయకపురంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చాయి. అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లా శ్రీనివాస శాస్త్రి తయారు చేయించిన ఈ పాదుకలను రామునికి సమర్పించే క్రమంలో దేశమంతా ఊరేగిస్తున్నారు. స్వామివారి పాదుకలకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వీటిని స్థానిక గణపతి దేవాలయానికి, కోదండ రామాలయానికి తీసుకువచ్చారు. పంచామృతాలతో శ్రీరాముని పాదుకులను అభిషేకించారు. అనంతరం గుత్తులవారిపాలెం రామాలయంలో పూజలు చేశారు.

జట్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

తాళ్లరేవు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ గురువారం పటవలలో ప్రారంభమైంది. స్థానిక పోలిశెట్టి వీరాంజనేయులు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ రాయుడు సునీత దీనిని ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించి, జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్టు స్కూల్ పీడీ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీవీ ప్రసాద్, కాకినాడ పీఈటీ సంఘ ప్రెసిడెంట్ వి.మాచరరావు పాల్గొన్నారు.

బీమా సొమ్ముతో ఆసరా

ఎమ్మెల్యే ద్వారంపూడి



బీమా చెక్కును మృతుని భార్యకు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ప్రమాదంలో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా సొమ్ము కొంత ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 12వ డివిజన్ పరలోపేటకు చెందిన చింతపల్లి రాజు గత నెలలో సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ సొమ్మును మృతుని భార్య చింతపల్లి నూకరత్నానికి ఆయన గురువారం సాయంత్రం తన నివాసం వద్ద అందజేశారు. జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, 12వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బొద్దిరెడ్ల పరశురామ్ తదితరులు ఉన్నారు.

వేట్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలన



పాఠశాల భవనాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఆర్జేడీ నాగమణి బృందం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్ తరగతి గదులను ఆర్జేడీ నాగమణి బృందం గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇటీవల జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఈ పాఠశాల తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానే కొత్త గదులను నిర్మించాలని ప్రస్తావించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్జేడీ బృందం తరగతి గదులను పరిశీలించి బీటలు వారిన గోడలను గుర్తించి, బిల్డింగ్ ప్లాన్, క్వాలిటీ శాంపిల్స్ అత్యవసరంగా తయారు చేసి నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ శాఖను ఆదేశించింది. ఎస్ఈ బీవీవీ సత్యనారాయణ, డీఈ ఎస్ఎస్‌డీ సత్తిరాజు, పంచాయతీరాజ్ డీఈ వి.భాస్కరరమేష్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంఈఓ-1 వై.శివరామకృష్ణయ్య, విద్యా కమిటీ చైర్మన్ సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం పి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'అరబిందో' సేవలు ప్రశంసనీయం



శిక్షణ పొందిన వారితో ఫ్యాకల్టీలు

కొత్తపల్లి: తీర గ్రామాల అభివృద్ధికి అరవిందో ఫార్మా ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఇంచార్జి ఏపీఎం సబీనా ప్రియదర్శిని అన్నారు. మండలంలోని మూలపేటలో యువతీ యువకులకు మహిళా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభా కేంద్రం ద్వారా అరబిందో ఫార్మా ఫౌండేషన్, కాకినాడ సెజ్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 67 మందికి గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, అరవిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రత్తిపాడు రూరల్: శ్రీదేవి నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని గజ్జనపూడిలో శుక్రవారం నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గురువారం నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు.

ఏపీఎస్పీలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది

కాకినాడ రూరల్: కాకినాడ మూడవ బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంపులో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావు ఆదేశాల మేరకు సీహెచ్ భద్రయ్య పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులకు, పోలీసు సిబ్బంది, ఆఫీసర్లకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది మొత్తం 76 మంది, వ్యాసరచన పోటీల్లో 166 మంది, వక్తృత్వ పోటీలలో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఆర్ఐలు సురేష్ బాబు, వి.రాము, సతీష్, గణేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

తుని రూరల్: నియోజకవర్గంలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాలు, తుని పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఐసీడీఎస్ కాకినాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రవీణ పర్యవేక్షణలో తుని, పెద్దాపురం, తాళ్లరేవు, ప్రత్తిపాడు, జగ్గంపేట, శంఖవరం, కాకినాడ జిల్లా నోడల్ అధికారి వై.లక్ష్మి, సీడీపీఓలు అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, సరకు నిల్వలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులతో మాట్లాడి సరుకులు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. తనిఖీల్లో సీడీపీఓలు వి.మాధవి, ఎ.జ్యోతి, ఆర్‌పీఎస్ లక్ష్మి, ఎం.పూర్ణిమ, టీడీఆర్ పద్మ, కె.శ్రీలత, జి.ఉషా తదితరులు పాల్గొన్నారు.

సీతాఫలం కనుమరుగు!

- లాభసాటి కాకపోవడంతో క్రమంగా తగ్గుతున్న సాగుభూమి
- చెట్ల స్థానే రియల్ ఎస్టేట్లు
- దిగుబడి తగ్గి ధర భారం



కొనేవారు లేక వెల వెలబోతున్న సీతాఫలాల విక్రయాలు

సామర్లకోట: కాలానుగుణంగా ప్రకృతి ప్రసాదించిన ఫలాలను తీసుకోవడం ద్వారా ఆ కాలంలో ఎదురయ్యే దుష్ప్రభావాలను బలంగా ఎదుర్కొనవచ్చని వైద్యులు సూచిస్తుంటారు. తీరా ఆ కాలం వచ్చాక ఆయా కాలాల్లో వచ్చే ఫలాలు సామాన్యుడికి చేతికి అందనంత ఎత్తులో ఉంటున్నాయి. ఈ కాలంలో పండే సీతాఫలానిదీ అదే పరిస్థితి. మెట్ట ప్రాంతంలో ఈ తోటలు ఎక్కువే. కానీ పంటలు లాభసాటి కాకపోవడంతో రైతులు తమ భూములను విక్రయిస్తుండడంతో అవి రియల్ ఎస్టేట్లుగా, ఇండస్ట్రియల్ ఏరియాలుగా మారిపోతున్నాయి. గతంలో రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు ఏడీబీ విస్తరణ కాక ముందు రోడ్డుకు ఇరువైపులా సీతాఫలం తోటలు ఉండేవి. దాంతో రాజమహేంద్రవరం సమీపంలో దివాన్ చెరువు వద్ద వీటికి పెద్ద మార్కెట్టే ఉండేది. ఉన్న కొద్దిపాటి భూముల్లో పండే సీతాఫలాలు డిమాండ్ రీత్యా ధరలు ఆకాసంలో ఉంటూ సామాన్యుడికి అందడం లేదు.

వర్షాలు లేక.. కాపు కాయక..

సీతాఫలాలు కాసేందుకు అవసరమయ్యే వర్షాలు మరీ ముఖం చాటేయడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయి చాలా నష్టపోయామని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రంగంపేట మండలం, అటవీ ప్రాంతాల నుంచి మాత్రమే సీతాఫలాలు వస్తున్నాయి. 25 సీతాఫలాలు రూ.800 నుంచి రూ.900 వరకు విక్రయిస్తున్నారు.

భారీగా చెట్ల నరికివేత..



మెట్ట ప్రాంతంలో ఉండే సీతాఫల చెట్లను నరికేస్తున్నారు. దీంతో రంగంపేట, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వంద పండ్లను రూ.1200 నుంచి రూ.1,500కు కొనుగోలు చేసి విక్రయిస్తున్నాం. పండ్లు తయారు కాకపోవడంతో ప్రజలు కొనుగోలు చేయడం లేదు. 20 ఏళ్లుగా రంగంపేట మండలం కోటపాడు నుంచి సామర్లకోట వచ్చి ఆయా సీజన్లలో పండ్లు విక్రయిస్తున్నా.

– బి.వెంకటేశ్వర్లు, పండ్ల వ్యాపారి, కోటపాడు

పండ్ల మొక్కలపై అవగాహన పెరగాలి



ప్రజల ఆరోగ్యం కాపాడటానికి ప్రస్తుత సీజన్‌లో మొక్కలు నాటే సమయంలో పండ్ల మొక్కలు నాటడంపై అవగాహన పెంచాలి. సీతాఫలం, మామిడి, నేరేడు వంటి పండ్ల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రోడ్డు మార్జిన్‌లోను, పాఠశాలల ఆవరణలోను నాటేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే భావితరాల ఆరోగ్యాన్ని కాపాడే పండ్ల మొక్కలపై అవగాహన ఉంటుంది.

– గోపు నారాయణమూర్తి, రైతు సంఘ నాయకుడు, తాటిపర్తి